సకలము అనిత్యము, సత్యమే నిత్యము—అని నమ్మిక. అబద్ధం మహాపాపం. అయినా అబద్ధం ఆడడం కొన్ని సందర్భాలలో అనివార్యం కావచ్చు. క్షంతవ్యం కూడా. అభిమాన ధనులు మాత్రం ప్రాణాలకు తెగించి మానం నిలబెట్టుకొంటారు. అలాంటివారు సైతం అబద్ధం ఆడడానికి అనుమానించరంటే అందుకు విశేషమైన కారణం ఉండాలి, మరి.

## జి. శ్రీరామమూర్తి

**"గౌరి** బావిలో పడింది, బావిలో పడింది." కలవారి ఇంట్లో కల్లోలం పుట్టింది.

"ఏమిటే, ఏం జరిగిందమ్మా?" పక్కింటి వారిని కూడా తీసుకువచ్చింది ఆ గోల.

"మా శాయిలాయి లేదూ, వాడి పెంపుడు కుక్క బావిలో పడింది!" చినబాబు హడిలి పోయేటట్టు అన్నాడు.

"పిల్లితో అన్నం వద్ద కాట్లాట వచ్చి దాన్ని పట్టుకో బోయి బావిలో పడింది." మరో గొంతు.

అప్పుడే కర్రపోటు చప్పుడు దగ్గిరగా వినవచ్చింది.

"ఏవాయె, సినయ్యగోరూ?" శాయిలాయి ఆదుర్దాగా ప్రశ్నించాడు.

"ఒరేయ్, శాయిలాయ్, నీ కుక్క లేదూ, అది బావిలో పడిందిరా!" గాభరాగా పెద్ద వార్తాహరుడులా చెప్పాడు బాబు.

"హా!" బెంబేలు పడినట్లయ్యాడు శాయిలాయి. ఏదన్నా సాహసం చేస్తాడేమోనని అందరూ భయపడి పోయారు. కాని, ఇంటి యజమానురాలు భరోసా ఇచ్చింది.

"అంత గాభరా పడతాడేం వీడు? ఏం చేస్తాడు, కుంటికాలా వీడూను! దాని కలా రాసి పెట్టి ఉంది!" ఆమె మాటల్లో వేదాంతిలోని సర్వజ్ఞతా, తూష్ణీ భావమూ గోచరించాయి.

"శాయిలాయి బావిలో దూకేశాడు!" క్షణం గడిచిందో లేదో, మళ్ళీ చినబాబు ఓ పెద్ద వార్త పట్టుకు వచ్చాడు.

"హా!" అందరూ సామూహికంగా ఆశ్చర్యపడి పడిపోయారు క్షణం సేపు.

బావి వద్దకు పరిగెత్తి చుట్టూ చేరారు.

"బాబుగోరూ, మన పాత ఉయ్యాలకు తాడు గట్టి జారెయ్యండి. . . బాబ్బాబు! గౌరి ప్రాణం గుటుక్కు మంటుంది, శనంతాల్లే. . ." ప్రాధేయ పడ్డది పాతాళ గంగలో నించి స్వరం! అది ఆజ్ఞగా స్వీకరించక తప్పింది కాదు, ఆ క్షణంలో!

ఉయ్యాలకు తాడు గట్టి దింపాడు బావిలోకి.

కుక్క ప్రాణం రక్షించబడింది.

ఒంటిపురి తాడుమీద శాయిలాయి పాతాళంలో నించి పైకి వస్తూంటే చినబాబు కేమిటి, ఎన్నో అద్భుతాలను చూసి ఉన్న ఆ ఇంటి పెద్దలే తమ కళ్ళను తామే నమ్మలేక పోయారు!

"ఓరి నీ బండబడ! ఎంత సాహసం చేశావురా!" ఎనిమిది పదుల నించి ప్రపంచాన్ని చూస్తూన్న ఇంటి వృద్ధు ఆశ్చర్య పోయింది.

"నాకే కనక అధికారం ఉంటే వీడికి ఓ పరమ వీర చక్ర బహూకరించి ఉందును." కాబోయే ఇంటి పెద్ద పండుబాబు అన్నాడు.

ప్రాణాలతో బయటపడ్డ గౌరి ఊరికే శాయిలాయి అవిటికాలు నాకింది. అది వాడికి మరో కాలూ, తోడూ నీడా!

శ్రమ జీవనంలో కండలు తిరిగిన చెయ్యిని గౌరి మీదికి పోనిస్తూ, అభయహస్తం ఇస్తున్నట్టు దాన్ని నిమిరాడు శాయిలాయి.

ఆయాసంతో వాడి వెడదరొమ్ము ఉప్పెత్తుగా లేచి పోతూంది. తేనె తుట్టెలా, చిక్కగా, తుమ్మెద రెక్కల్లా నల్లగా ఉన్న జుట్టు ముఖాన్ని సగం కప్పేసింది.

మగటిమి చాటే, మీసాలపై నిలిచిన నీటిబొట్లు, అదోలా మీటి వేశాడు, శాయిలాయి!

● ● ●

శాయిలాయి!

దాదాపు అయిదేళ్ళనాడు హడావిడి కేమీ కొదవ లేని ఆ ఇంట్లో తెల్లవారేటప్పటికి ఓ పెద్ద అలజడి జరుగుతూంది.

పెరట్లో నించి పెద్ద కేకలు.

ఎండ ఎక్కాక తెలిసిందేమంటే, రోజూ వచ్చే పని మనిషి ఆ రోజు రావటం మానేసిందిట. దానితో కాలం స్తంభించి పోయినట్లయింది. భూభ్రమణమే నిలిచి పోయినట్లయింది.

ఔను, సత్రంలా అస్తమానమూ, అమావాసతు బంధుమిత్రుల ఆగమనంతో, రోజూ పూటకు అడ్డెడు ఉడికే ఆ ఇంటిలో పనిమనిషి మానుకుంటే నిజంగా కాలం ఆగిపోయినట్లే అవుతుంది.

"పనిమనిషిని మానిపిస్తే మీదేం పోయింది, మధ్య చచ్చేది నేను." గృహిణి విసుక్కుంది. ఆ మాటలు అప్పుడే అత్తగారు, ఇంటి వృద్ధురాలయిన ఆవిడికి వినపడక పోలేదు.

"ఆరవేసిన గుడ్డల్లో, సగం పోతూంటే, ఆ దొంగ చచ్చిందాన్ని ఎన్నాళ్ళు పెట్టుకుండేట్టు? పైగా, ఆ కుంకకు మడీ మన్నూ తెలిసి చావదు. సర్వం జగన్నాథం! పోతే పోయిందిలే! 'కో' మంటే కోటిమంది వస్తారు. పనిమనుషుల కేం తక్కువ?" ఇంటివృద్ధు సమాధానం.

"మాటలకేం, కూర్చుని ఎన్నయినా చెబుతారు." అత్తగారంటే ఇంకా భయం పోని గృహిణి ఈ మాటలు అస్పష్టంగానే అన్నది.

ఇంటి వృద్ధేకాదు, ఇంట్లో వాళ్ళందరూ 'కో' మన్నా, 'కొక్కొరోకో' అన్నా కొన్ని రోజుల వరకూ పనిమనిషే దొరికింది కాదు. ఒకరు, "మీ ఇంట్లో ఎవరు చేసి బతుకుతారుపొమ్మా?" అన్నారు. మరొకరు చాకిరీరెండు పూటలా అన్నం పెట్టి రెండు పదులు ఇవ్వమన్నారు.

పనిమనిషి లేని ఆ ఇంట్లో పాట్లు దేవుడి కెరుక.

పిల్లలకు బళ్ళు ఆలస్యం.

ప్లీడరుగారికి కోర్టు ఆలస్యం.

ఒక్కోరు, రెండు రోజుల కోమారు స్నానం.

పిల్లాడి పాడిగుడ్డలు మురిగి పోతున్నాయని పెద్ద కోడలు ఒకటే గోల.

అలాంటి రోజుల్లో ఓ రోజు! జోరున వర్షం. రాత్రి పూట. ఎవరో కర్రపోటు వేసుకుంటూ తల దాచుకోవడానికి వచ్చారు.

"అయ్యా, అమ్మా, దేశం కాని దేశం కూత్తరేత్రి గడపనివ్వండి. తెల్లారగట్ల లేచిపోతాను" అంటూ ఓ మానవాకారం ప్రాధేయ పడింది. కాదనలేక పోయారు ఇంటివాళ్ళు. లోనికి వచ్చాడు. వరాండాలో పడుకున్నాడు.

నిద్రపట్టక ఏవో మాటలు కలిపారు పండుబాబు, గృహిణి.

"ఏ ఊరబ్బాయి, మీది?"

"మాది ఈ రాజ్జం కాదమ్మగోరూ, దవ్వాదిలెండి, నిడమనూరు." శాయిలాయి విధేయతగా అన్నాడు.

"ఏం వచ్చావు?"

"ఎందు కొత్తాం, బాబూ! పొట్టసేత బట్టుక వొచ్చాం?"

"నువ్వేనా, ఇంకెవరన్నా వచ్చారా?"

"నాతోపాటు మరి చానామంది వచ్చారమ్మా."

"ఒరే అబ్బాయ్, మీ జట్టులో ఎవరన్నా మా ఇంట్లో పనికి కుదురుతారుట్రా?" గృహిణి ప్రశ్నించింది.

"పనా! అమ్మగోరూ, ఒకళ్ళతో పనేంటి, నానే జేస్తానండీ మీ ఇంట్లో పనంతా, అమ్మగోరూ. కూత్త దయుంచండి." ప్రాధేయ పడుతూన్నట్లన్నాడు.

"ఆ నీవా!" ఆశ్చర్య పోయింది గృహిణి.

ఏ మాట చెప్పడానికి తెల్లవారితేనేగాని వీల్లేదంది.

తెల్లవారింది. సన్నగా, తోటకూరకాడలా ఓ కాలు వేళ్ళాడుతూంటే, పర్వతంలాంటి శరీరాన్ని, ఓ కర్ర సాయంతో మోస్తూన్న మనిషి కనిపించాడు!

"నీ పేరు?"

"శాయిలాయి!" అమాయకంగా అన్నాడు.

గృహిణి పెదవి విరిచింది శాయిలాయి కాలు చూసి.

శాయిలాయి గాభరా పడిపోయాడు.

"అమ్మగోరూ, అనుమాన మెట్టుకోకండి. ఎంత పనయినా ఈడిసి అవతల పారేస్తాను. గంగపాలెం గౌరమ్మ నా కా పుట్టే ఇచ్చింది" అన్నాడు.

ఇంకా అనుమానం తీరలేదు ఆవిడికి.

"అమ్మగోరూ, పోనీ, ఈ మాసమల్లా సూడండి. పనికిరాకపోతే తీసెయ్యండి" అంటూ కాళ్ళు పట్టుకో బోయాడు.

"పోనీ, ఉండనివ్వవే అమ్మా. ఇట్లాంటి వాళ్ళకు భలే బలం ఉంటుంది" అన్నాడు పండుబాబు.

"బాబ్బాబు, దణ్ణాలు బాబు, రచ్చించారు. మీకు వెయ్యేళ్ళు" అన్నాడు శాయిలాయి.

రెండు పూటల అన్నం పెట్టి నెలకు పది ఇచ్చేట్టు ఒప్పుకున్నారు. గూడు కట్టుకుండేవరకు ఆ ఇంట్లోనే పంచలో పడుకుంటానని కోరాడు. ఒప్పుకున్నారు ఇంటి పెద్దలు.

అలా వచ్చి చేరాడు శాయిలాయి.

బిలబిల పక్షులు లేవకముందే లేచి, పాచిపని, నీళ్ళు తోడటం, కసువు అన్నీ పనులూ లాగి పారవేసేవాడు. ఏదో రాక్షస శక్తి ప్రవేశించినవాడిలా అన్ని పనులూ త్రుటిలో చేసేవాడు. గృహిణికీ, అత్తగారికీ సగం వైరం తీరిపోయింది. కుర్రాళ్ళు వేళకు బడికి పోతున్నారు.



# శాయిలాయి

శాయిలాయి ఆ ఇంట్లో ప్రవేశించినప్పటినుండీ, ఇల్లంతా పండుగ శోభతో కలకలలాడుతూంది. అయి దేండ్లనుండీ అద్దంలా శుభ్రంగా ఉంచాడు ఇంటిని.

ఆ ఇంటిని స్వంత ఇల్లు చేసుకున్నాడు.

కష్టానికి తగ్గ ఫలం కూడా చేకూరేది. రెండు చేతులా, కడుపు నిండా కమ్మటి తిండి పడవేసేది గృహిణి. చాకిరీ అంతా అయిన తరవాత, తృప్తిగా తిని గుర్రుపెట్టి నిద్ర పోయేవాడు.

ఇంట్లో కుర్రాళ్ళు మాసి విడిచిన షర్టులు వాడివే అయ్యేవి. అప్పుడప్పుడూ చెమటకు మాసిన సిల్కు షర్టు తొడుక్కుని, ఎక్కడో మూలపడిన అద్దం ముక్కలో ప్రథమతహ తన ముఖానికేసి చూసుకున్నాడు శాయిలాయి.

కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర, యజమాని ఆదరాభిమానాలు లభించడంతో శాయిలాయి మురికి విడిచి కొంచెం ఎరుపుకు తిరిగాడు. పనంతా అయి, తీరిక చిక్కాక తన ఒంటిమీద శ్రద్ధ చూపడం మొదలెట్టాడు.

•   •   •

కట్టుమట్టు తాడు లాక్కుంటూ దాంపత్యానికై అంగలారుస్తున్న గోవు కన్నె ఆర్తిలా ఎక్కడ చూసినా సన్నాయి మంగళ వాద్యాలు. వంత పలుకుతూ డోళ్ళు, రాండోళ్ళు. పుడమి కన్నె పెళ్ళిలా ఎక్కడ చూసినా పెళ్ళి పందిళ్ళే!

తను రోజూ కాన్వెంటుకు టిపెను కారేజీ తీసుకు వెళ్ళి ఇచ్చే సరలమ్మగారు పెండ్లి కూతురు అయిందంటే నమ్మలేకపోయాడు శాయిలాయి.

అజ్ఞాతంగా ఉన్నా, తలంట్లు దగ్గరనుంచీ పని అంతా నెత్తిమీద వేసుకుని ఆ ఇంట్లో కార్యం గట్టెక్కించాడు శాయిలాయి.







# శాయిలాయి

అందుకు గృహిణి, ఇంటివృద్ధు, పండుబాబు, ప్లీడరుగారు ఎంతో మెచ్చుకున్నారు శాయిలాయిని.

"ఒరేయ్, నీవేలేకపోతే మా కెన్ని అవాకులూ, చవాకులూ వచ్చేవో?" అన్నారు.

"ఆఁ, నా దేటి అమ్మగోరూ, మీ పాదాలెమ్మటి పురుగును." నిర్లిప్తంగా అన్నాడు శాయిలాయి.

"ఒరేయ్, శాయిలాయ్, మరి నీ పెళ్లెప్పుడురా? నీవూ ఒకింటి వాడివైతే కళ్ళజూసి పోవాలని ఉందిరా" అంది ఇంటి వృద్ధు.

"ఆఁ, నాకు పెళ్లేంటమ్మగోరూ, అవిటి ముండా కొడుకుని." కొట్టిపారవేస్తూ అన్నా, అందులో నైరాశ్యం ద్యోతకం కాక పోలేదు.

"శాయిలాయి పెళ్ళి, శాయిలాయి పెళ్ళి
చూసి వత్దాం రాండి!
ఆకూ వక్కా తేండీ,
వేసుకుందాం రండీ!" అప్పుడే చినబాబు పాట ఎంకించుకున్నాడు.

శాయిలాయి తన పెళ్ళి ప్రస్తావన వచ్చినప్పటి నుండీ మొదటి సారిగా ఏవో ఆలోచనలకు లోనయి పోయాడు. అప్పటినుండీ వాడిలో మార్పు చూడగల వారికి కనిపిస్తూనే ఉంది.

పని అంతా ఇదివరకంటే తొందరగా ముగిస్తూ తన గుడ్డలు కూడా ఉతుక్కుంటున్నాడు. ఇస్త్రీ చెయ్యలేదన్న మాటే గాని, బట్టలు శుభ్రంగా ఉంచుకుంటున్నాడు. లాగు జేబులో ఎక్కడో ఉంచుకున్న దువ్వెన పిక్కతో చింకి తల దువ్వుకుంటున్నాడు.

కుర్రాళ్ళలో సినిమా విషయాలు చర్చిస్తున్నాడు.

అప్పుడప్పుడూ పెద్దయ్యగారిని అడిగి డబ్బు తీసుకుని కాఫీ తాగి వచ్చేవాడు.

ఒకనాడు ఎంతో ప్రయత్నంమీద అనుమానించి, అనుమానించి పెద్దయ్యగారి వద్దకు వెళ్ళాడు.

"అయ్యగోరూ, పెద్ద పండక్కు మా ఊరు దచ్చాది ఎడదామని అనుకుంటుండానండీ! శానా రోజులయింది సూసి ఇంటికాడ మా అప్పసెల్లెలు గవురిని. దానికి ఎనకా ముందూ ఎవరూ లేరూ నే దప్పక. సిన్నప్పుడే మొగుడు పోయాడు. నా కోసం బెంగెట్టుకున్నదంట. దచ్చాది వరికోతలకు పోయొచ్చినోళ్ళు చెప్పారు" అంటూ వినయంగా అన్నాడు.

తన్ను నీడలా ఎప్పుడు అంటిపెట్టుకుని ఉండే కుక్కకు శాయిలాయి ఆ పేరు ఎందుకు పెట్టుకున్నాడో అప్పుడు గాని ప్లీడరు గారికి, ఇంకా ఇంట్లో వారికి అర్థం కాలేదు.

ఎప్పుడూ ఏదో పని తొందరలో ఉండే ప్లీడరుగారు, "అయితే పోయి త్వరగా రా" అంటూ డబ్బిచ్చాడు.

ఇంటి యజమానురాలు, ఆవిడ అత్తగారు ఒకటే గోల, ఈ మాట విని. శాయిలాయి వెడితే కొంప క్షణం జరుగుతుందా అని వాళ్ళ బెంగ!

"ఉత్తరం రాసి కనుక్కోరా, మీ చెల్లెలు సంగతి" అంది గృహిణి.

"అమ్మా, ఆ సీటే ఎన్నాళ్ళకి ఎళుతుందో, ఏమో?" అన్నాడు శాయిలాయి. వాడి మనసులో ఉన్న నిజమైన కోరికను ఓ అర్ధరాత్రి గృహిణి పాదాలవద్ద పడుకుని మెలకువ వచ్చిన వేళ బయట పెట్టాడు.

"అమ్మగోరూ, మీ రేమీ అనుకోకపోతే ఉన్న విషయం చెబుతాను. ఉగాదెల్లాక మూర్తాల్లో మంచి మాట అనుకున్నామని మా యప్పజెల్లెలు కబురు చేసిందమ్మగోరూ" అన్నాడు బెరుకుగా.

"ఏమిటి, నీ పెళ్ళా? ఇన్నాళ్ళు చెప్పలేదేంరా?" గృహిణి నిలదీసి అడిగింది నవ్వుతూ.

"అట్లా అనకండమ్మా, నాను సచ్చిపోతే ఏడవటానికి ఒక్కరన్నా ఉండొద్దమ్మా?" అంటూ దీనంగా అన్నాడు శాయిలాయి.

తెల్లారేసరికి ఆ విషయం ఇంట్లో అందరికీ తెలిసిపోయింది. చినబాబు "శాయిలాయి పెళ్ళి" అన్నపాటకు మరి రెండు చరణాలు కలిపి పాడడం మొదలెట్టాడు.

ఇంటి పెద్దలు శాయిలాయి వెళ్ళడానికి ఒప్పుకోక తప్పలేదు.

"నీవు వెడితే వెళ్లేవు గాని ఎవరినన్నా కుదిర్చి మరీ వెళ్ళు. వెళ్ళి అక్కడే కూర్చోక త్వరగా తిరిగిరా" అంది గృహిణి.

"పెళ్ళి అయ్యాక శాయిలాయి మన కళ్ళకు కనపడతాడా?" అంది ఇంటివృద్ధు. అందరూ నవ్వుకున్నారు.

"ఎవరు దొరుకుతారమ్మా? పైగా, సేతి నిండా పనిరోజులు!" అన్నాడు శాయిలాయి.

"ఏమయినా సరే, ఎవర్నన్నా కుదిర్చి వెళ్ళు" అన్నారు ప్లీడరుగారు చివరిసారిగా.

శాయిలాయి నాలుగు రోజులపాటు టౌనంతా గాలించాడు మారు పెట్టుకోవడానికి. కాని, పనిమనిషి ఎవరూ దొరకలేదు.

ఇంతలో వాళ్ళ అప్పజెల్లెలుకు వాతరోగం వచ్చి మంచాన పడిందని కమ్మ వచ్చింది.

వెంటనే శాయిలాయి బయలు దేరక తప్పింది కాదు.

శాయిలాయి వెళ్ళాడో, లేదో మళ్ళీ ఇంట్లో చెంబూ తప్పెలాల అల్లరి తప్పింది కాదు. మళ్ళీ కాలం స్తంభించి పోయిన ట్లయింది. వాడు వెళ్ళి రెండు రోజులే అయినా రెండు యుగాలుగా ఉంది.

మూడవ రోజు తెల్లారగట్ల ముచ్చటయిన ఓ అమ్మాయి వచ్చింది.

"అమ్మగోరూ, మీ ఇంట్లో పనిమనిషి కావాలంటగా?"

"ఆఁ, ఆఁ. శాయిలాయి పంపాడా?"

"లేదమ్మగోరూ, నానే వచ్చా . . . అల్లి బాయిలో కుక్క పడితే తీసి నోడి ఇల్లే గదమ్మా ఇది?"

"ఆఁ...ఆఁ...వాడే. కుంటబ్బాయి పనిచేసే ఇల్లే ఇది."

ఆ అమ్మాయి ఏమీ మాట్లాడలేదు. చూస్తే ఇంకా పుస్తె మెడలో పడినట్లు లేదు.

"నీ పేరు?" గృహిణి అడిగింది.

"శాయిలమ్మ!"

"ఏమిటి, శాయిలమ్మా?" విస్తుపోయారు అందరూ.

"సత్తెం, నా పేరు శాయిలమ్మ" అంది అమాయికంగా.

శాయిలమ్మ ఆ ఇంట్లో [illegible]కి కుదిరింది. [illegible] డంత చాకిరి ఆ అమ్మాయి ఎట్లా చేస్తుంది? ఒక్క శాయిలాయికి తక్క ఆ ఇంట్లో పని ఎవరికి సాధ్యమవుతుంది!

కాని శాయిలాయి దచ్చాది వెళ్ళిన పదోనాడే తిరిగి వచ్చాడు. అక్కడ వాడి చెల్లెలు గారికి వాతరోగం ముదిరిపోయి గుటుక్కుమంది ఓ తెల్లవారగట్ల. ఇక నా అనేవాళ్ళు లేకపోయినారు శాయిలాయికి. ఇక వాడి ఆలనా పాలనా చూసేదెవరు? తన దరిద్రానికి తోడు, పెళ్ళిమాట కూడా అనుకున్నందుకు లోలోపల సిగ్గుపడి కుమిలిపోయాడు. "దరిద్రపు మొహానికి దసరా పండగా?" అన్నట్లు, అయినా తనకు పెళ్ళేమిటి? నిరాశ నెత్తిన వేసుకుని తిరిగి చక్కా వచ్చాడు.

"పాపం!" అన్నారు ఇంటివారు.

పంపు దగ్గిరికి వెళ్ళి నెత్తిన ఓ కడవ, చంకలో ఓ కడవతో వస్తూంది శాయిలమ్మ.

మాడు చితికిపోయే బరువుకు నెత్తిమీద బిందె తొలిగింది. ఒక్క క్షణంలో బిందె నేల కరిచి చితికిపోయేదే; కాని, శాయిలాయి అమాంతం వెళ్ళి పట్టుకున్నాడు.

"ఏంఁ పిల్లా, ఆ మాత్రం బరువు మొయ్యలేవా?" అంటూ కడవ బుజాన బెట్టుకుని, చంకలో దీతక్ర పెట్టుకుని నడిచాడు.

విస్తుపోతూ చూసింది శాయిలమ్మ.

మరువాడు శాయిలమ్మ మరో చోటికి వెడతానంది. శాయిలాయి ఏదో బాధగా చూశాడు. ప్లీడరు బాబుగారు చూసి గ్రహించారు.

"పోనియ్యి, ఆ అమ్మాయికూడా నీకు తోడుగా ఉంటుంది. ఇద్దరూ ఉండండి" అన్నాడు ప్లీడరుగారు. పండుబాబు భలే ఆలోచన అన్నాడు. ఇంట్లో అంతా సంతోషించారు.

మొదటి సారిగా తా నా ఇంట్లో ప్రవేశించడానికి పండుబాబే కారణం.

ఇప్పుడు తనకు తోడు దొరకడానికి కూడా పండు బాబే సాయం చేశాడు. మనసులో మొక్కుకున్నాడు బాబుకు శాయిలాయి.

శాయిలమ్మ కూడా అంగీకరించినట్లు ఏమీ మాట్లాడలేదు.

ఏమిటో పిచ్చి సంతోషంతో ఇదయి పోయాడు శాయిలాయి.

"పేరులో కుదిరిన దాంపత్యం జీవితంలో కూడా ఉంటే ఎంత బాగుణ్ణు" అనుకున్నారు ఇంటి పెద్దలు.

ఎప్పుడో, ఇంకా ఎంత తీవ్రంగానో ఈ తియ్యని ఆలోచన శాయిలాయిలో ప్రవేశించింది. కాని,తన అవిటి కాలుకేసి చూసుకుంటూ దీనంగా ఉండిపోయాడు.

ఓ నాడు ఇంటి పెద్దలందరూ కూడబలుక్కున్నారు. ఈ విషయం తేలుద్దామనుకున్నారు.

"ఏమే, శాయిలమ్మా, ఓ మాట అడుగుతాము, చెబుతావా?"

"ఏం టమ్మా అది?"

"శాయిలమ్మా, నీకు మనువు ఎవరన్నా ఉన్నారా?"

"ఏం మా టమ్మగోరూ, నా కేటి తెలుసుద్ది?" సిగ్గు పడిపోయింది శాయిలమ్మ.

"శాయిలాయి అంటే నీకు ఇష్టమేనా!"

ఏన్ని ఆలోచనలు [illegible] ఆ పదంచు మనసులో! ఒళ్ళంతా గగుర్పొడిచినట్లయింది. 'పెద్ద గత ఈత గాళ్ళు కూడా దిగ వెరిచే బావిలో దిగి కుక్క ప్రాణం రక్షించిన వీరుడికి, ఒక కాలు తక్కువైతే నేం మగ సిరి కలవా' డనుకున్నదో ఏమో!

శాయిలమ్మ మాట్లాడలేదు. సిగ్గుతో తల వంచుకు పోయింది.

"ఏరా, శాయిలమ్మ అంటే నీ కిష్టమేనా?" శాయిలాయిని అడిగారు.

శాయిలాయి తన చెవుల్ని నమ్మలేకపోయాడు. చిత్రంగా నవ్వుకున్నాడు.

"నన్ను చేసుకుంటుందమ్మా అది?"

"ఒరేయ్, ఆంజనేయస్వామి లాంటి వాడివి నీవు. నీ శక్తి నీకు తెలీదు. ఇక మారు మాటాడకు" అన్నారు.

[illegible] కుక్కపిల్లగు [illegible], చేతు [illegible] చలబయ్యా? గజ ఈతగాడు కూడా నీకు సాటి వనిపించావు గదంటయ్యా?"

ఆ నాడు బావిచుట్టూ చేరిన జనంలో శాయిలమ్మ కూడా ఉన్నదని అర్థం చేసుకున్నాడు శాయిలాయి.

మనసులు పెనవేసుకున్నప్పుడు కలిమికి పేదయితే నేమి? శాయిలాయి కార్మికవాడలో గూడొక కట్టుకుని కాపరం పెట్టాడు. చిలకా గోర్వంకల్లా కాపరం చేస్తూ, చెయ్యి చెయ్యి కలిపి పనిచేస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

"ఆడుతు పాడుతు పని చేస్తుంటే అలుపేమున్నది?
ఇద్దరమొకటై చేయి గలిపితే ఎదురేమున్నది"

అంటూ ఏ సినిమాలోనో విన్న పాటను పాడుకుంటూ, 'ఎక్కడ పాడిచావే పొద్దు' అన్నట్లు సంతోషంతో



హరిణాక్షి — ఫోటో—సి. శ్రీనివాసరావు (ఏలూరు)

దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలేనన్నట్లు, నలుగురూ చేతులు వేసిన మీదట నిర్లిప్తంగా నరసింహస్వామి గుళ్ళో పెళ్ళి జరిగిపోయింది.

అలా నిజ జీవితంలోనూ శాయిలాయీ శాయిలమ్మల దాంపత్యం స్థిరపడిపోయింది బస్తీ పక్కనే ఉన్న పల్లెలో గూడు కట్టుకున్నారు.

* * * *

"శాయిలూ, నన్నెందుకు పెళ్ళి చేసుకున్నావే, నాలో ఏం జూసినావంట?" గోముగా లడిగాడు శాయిలాయి ఓ నాడు, పెళ్ళాన్ని దగ్గిరికి తీసుకుంటూ.

"అన్నా లనమాకయ్యా, తప్పు." శాయిలాయి మీసకట్టును సరిచేసి దువ్వుతూ అంది శాయిలమ్మ.

"అయినా, నా చేత ఏమవుద్ది? అవిటోణ్ణి!"

"అబ్బో, ఆ యాల, పాతాళం నాటి బావిలో

మనుగడ సాగిస్తున్నారు.

శాయిలాయికి ఇప్పు డొక ఆలోచన కలిగింది.

శాయిలమ్మకు ఎన్నాళ్ళు ఇంటింటి చాకిరీ చెయ్యడానికి పంపేట్లు? అయినా ఇదేమి మగతనం!

"శాయిలూ..." లాలనగా అన్నాడు ఓ అర్ధరాత్రి, నిద్ర రానివేళ. అంత చీకటిలో కూడా గుమ్మడి పండు లాంటి చాయ కల శాయిలు ముఖం కనిపిస్తూనే ఉంది. ఇంత అందగత్తె,పుత్తడిబొమ్మ తనకు దక్కింది. ఈ ధనాన్ని తను ఎలా నిలుపు కోవడం? దొంగ ఎవడన్నా దొంగిలించి పారిపోతే, పరిగెత్తి పట్టుకోవడానికి తన వల్ల కూడా కాదే!

శాయిలమ్మ "ఏమిటి, మావా?" అంది.

"శాయిలూ, రేపటినుంచీ నీవు పని మానెయ్యవ్?"

"పని మానితే ఎట్టాగయ్యా? మని పని

## నా ఆశాకిరణం

**వి. నరహరిశర్మ**

ఎవరెస్టు లాంటి మహోన్నత
భావ శిఖరాల నుండి,
నయాగరా జలపాతంలా
పరుగుల పందెం వేసే
ఆలోచనా తరంగాలకు
ఆనకట్ట వేసింది ఆమె!

కాలిపోయి రాలిపోయే
సిగరెట్టు లాంటి జీవితంలో
అంతర్లీనమైన ఆనందానికి
చక్కని భాష్యం ప్రవచించి
మధురానుభూతుల వెన్నెలలో
దోబూచులాడింది ఆమె!

చితికిన జీవితపు ఎడారిలో
ఆదుకొనే అమృతమే కరువై
ఆశా దాహంతో తపించే
చరమ రాత్రి సంచలనంతో
ప్రీగంటి చూపుల మకరంద ధారలు
చిలకరించింది ఆమె!

కష్టాల పెను తుపానులో
నా అనే మనిషి లేని
ఈ అభాగ్యుని అంతిమ శ్వాస
చిరునవ్వుల దీవి చూపించి
రక్షించింది ఆమె!

విలువ కట్టలేని — ఈ
గుడ్డిలోకానికి
ప్రేమలోని నైర్మల్యాన్ని
పిలిపించి బోధించింది ఆమె!

పారిపోయిన పిట్టఅని
పనికట్టుకొని చాటించి
పగబూనిన పాడు లోకానికి
ఆదర్శ గృహిణిగా పాఠాలు
నేర్పించింది ఆమె!

ఆమె ఎవరో కాదు
నా కంటిలోపలి వెలుగు!
నా మాటల పాటల కనుపల్లవి,
వాడు ఆమె — నా ప్రేయసి
నేడు — నా ఆశా కిరణం! *

## శాయిలాయి

అయినట్టే!"

"అదుగో — మానేమంటే?" శాసిస్తున్నట్లన్నాడు శాయిలాయి.

"ఏం మాటది మావా, నాను పని మానేస్తే,నీ ఒక్కడివే జేప్తావంటయ్యా,ఒళ్ళు ఊనవయి పోతాది." జాలిగా అన్నది శాయిలమ్మ.

"అయితే మానే, మాను!"

"ఉహుం, నే ఒప్పుకోనయ్యా!" బెరుకుగానే అంది.

"అయితే పో" అంటూ కసిరికొట్టాడు.

"ఎందుకయ్యా, అంత అగ్గయి పోతావు? మన మంచికే జెప్పినానయ్యా!" బతిమాలుతున్నట్లుంది.

శాయిలాయికి తిక్క ఎక్కింది, పని మానేశాడు. అయినా అల కెంత సేపుంటుందిలే అని శాయిలమ్మ పేటలో బాబుగారింటికి పనికి వెడుతూనే ఉంది.

శాయిలాయికి ఏవేవో కోరికలు పొటమరిస్తున్నాయి. శాయిలు అస్తమానం తన ఒడిలో కూర్చుని, తన ఒంటి మీద చెయ్యి వేసి నిమురుతూ, ఏవేవో సంగతులు చెబుతూ, తను ఒకోమారు 'శతురు' మాట్లాడితే పగలబడి నవ్వుతూ తన్ను మెచ్చుకోవాలని వాడి కోరిక!

ఇప్పుడు శాయిలాయి తన కోరిక తీరని కారణా లకై అన్వేషణ మొదలెట్టాడు. 'తను వద్దన్నా శాయి అమ్మ పనికి ఎందుకు వెడుతూంట?' పండుబాబు శాయిల్ని ఈమధ్యన ఒకలేమయిన చూస్తున్నాడనీ, ఈ పల్లెలో కూడా అప్పుడప్పుడూ కనిపిస్తున్నాడనీ, ఎంకటేసుగాడు తనతో చెప్పిండు. 'అయినా తన కింత అన్నంపెట్టిన మారాజు, ఆశేస్తనే గుండెలో పొడు స్తాడా?' ఏవేవో ఆలోచనలతో ఇబ్బంది అయిపో యాడు శాయిలాయి.

ఓనాడు బయటకు వెడతానని బయలుదేరింది శాయిలు. వద్దన్నాడు శాయిలాయి. అయినా ఆమె మాట వినలేదు.

"ఒసేయ్, శాయిలూ, నీవేడ కెలుతున్నావో తెలవ దంటే? నీ కీ మద్దె కులుకు జేత్తయినాది" అన్నాడు.

"ఫో మావా! అనుమాన మెట్టుకోకు, అగసాట్ల పాలవుతాం. ఈపూటకు పని మానేత్తాలే! మా వద్దగ్గిర ముద్దులు గుడుత్తున్నానని చెబుతాలే" అంటూ ఇంట్లోకి వచ్చి శాయిలాయి ఒంటిపై చెయ్యివేసి లాలించింది.

• • •

రాత్రి. కటిక చీకటి. కన్ను పొడుచుకున్నా కనిపిం చడం లేదు. సన్నగా ఈదురుగాలి. ఉండీ ఉడిగీ ఉరుమూ, మెరుపూ.

దూరాన ఒకటీ రెండూ కుక్కలు 'కో' మంటూ గోడు ,ుడుస్తున్న సద్దు వినా ఊరు నిదరోతూంది.

నల్లటి ముసుగు కప్పుకుని సందులూ, గొందులూ తిరుగుతూ ఒ వ్యక్తి వెడుతున్నాడు.

ఊరు చివర దేవళం మలుపు తిరిగాడు. ఇక శబ్దం చేస్తే లాభం లేదని కాబోలు తిన్నగా అడుగులో అడుగు వేస్తూ పాకుతూన్నట్లు వెళ్లాడు.

సందులో మట్టింటి పక్కగా వెళ్లి, నల్లటి చీరలో

[illegible]

ఆ వ్యక్తి!

"అమ్మో, దొంగ! దొంగ, భస్తని." ఉలిక్కిపడి లేచి ఆ మనిషి గోలపెట్టింది. పక్కనే పడుకున్న ఊర కుక్క బౌమని అరిచి ఊరంతా లేపింది.

కఱ్ఱ లుచ్చుకుని జనమంతా ఎగబడ్డారు.

"భంపండి, నరకండి. ఎవడా పోకిరీ ఎదవ?" అంటూ హుంకరిస్తున్నారు. శాయిలాయి కూడా చకచకా కఱ్ఱపోటు వేసుకుంటూ ఎగబడ్డాడు.

"ఏరా, ఎవడివి వీవు?" రావులమ్మ భర్త ఆవ్యక్తి ముసుగు తొలిగించి హుంకరించాడు.

"హాఁ! పం...డు... బాబు!" శాయిలాయి అప్ర యత్నంగా అన్నాడు. ఆ మాటలు వచ్చాయో లేదో వ్యక్తి పరిగెత్తుకు పోవడానికి ప్రయత్నించాడు.

"పట్టుకో, పోనీబాకు. ఒరే, శాయిలాయి, నీవేపే పోతున్నాడు, పట్టుకో!" పెద్దకాపు రంకెవేశాడు.

క్షణంలో సగంలో ఆ వ్యక్తి నేరుగా శాయిలాయికి ఢీకొని వాడి బలిష్ఠమైన బాహువుల్లో చిక్కిపోయాడు.

"ఏరా, పేటలో ఉంటూ పల్లెటూరి వాళ్లపై ఎప్పుడు కన్నేశావురా? చచ్చావ్, ఈ దెబ్బతో..." అంటూ బాణాకఱ్ర చేత పుచ్చుకున్నాడు రావులమ్మ భర్త.

రావులమ్మ పథకం తప్పిందని చల్లగా జారుకుంది ఎన్నడో!

ఎత్తిన బాణాకఱ్ర పడిందంటే పండుబాబు బుఱ్ఱ పచ్చడి కావలిసిందే.

"ఆఁ, ఉండవయ్యా, ఆయన మీ యాడోళ్లకోసం రాలేదయ్యా!" ఈ మాటలు గుంపు చివరి నుంచి వినవచ్చాయి.

"మరి, ఎవరికోసం?" గద్దించాడు రావులమ్మ భర్త.

"ఎవరికోసం?" ఊరంతా ముక్తకంఠంతో ప్రశ్నిం చింది.

"ఆళ్లింట్లో నే పని జేత్తుండా గదయ్యా!" ప్రీనీడలో ఆ ముఖం వంచుకుపోయింది.

"శాయిలూ!" భూమి బద్దలయ్యేలా శాయిలాయి అరిచాడు, అతని బాహువుల్లోవ్యక్తిని అప్రయత్నం గానే వదిలివేశాడు.

"పేటలో కుఱ్ఱాణ్ణి మరిగింది ముండ!"

"బొనే, కుంటోణ్ణి గట్టుకుంటే, ఏం సుక వుంటది?"

చెవులు తూట్లు పడేలా ఒకటే గుసగుసలూ, మాటిపోటీలు జనంలోనించి.

ఉద్వేత్తుగా పొంగిన ఆవేశం చల్లారిపోగా పలచ బడ్డారు జనం.

• • • •

శాయిలాయి గూటికి చేరుకునేటప్పటికి గువ్వలా అయిపోయి ఓ మూల కుమిలి కుమిలి ఏడుస్తూంది శాయిలు.

వికీర్ణమయిన భావాలతో ఇబ్బందిఅయిపోతూ శాయిలు వేపు చూశాడు. మళ్లీ, మళ్లీ పరిశీలించి చూశాడు. వాడిలో అంతర్వాణి ప్రేరణలా కర్తవ్యంతలుక్కు మంది.

"శాయిలూ!" హృదయ విదారకంగా అరుస్తూ దగ్గిరగా వస్తూన్న భర్తముఖం చూడడానికి భయపడి పోయింది.

"ఏవయ్యా, నన్ను నం...పు...తా...వా...? సంపెయ్, ఇందయ్యా కత్తి!" వడవడ వణుకుతూన్న చేత్తో మడ్డుకత్తిని అందించబోయింది శాయిలు.

పులి కబళించబోతూన్న మేకపిల్లలా భయవిహ్వల అయిపోయింది.

క్షణం గడిచింది. మరో క్షణం... మరో...

కాని, శాయిలు మీద కత్తివేటు పడలేదు.

"మా పెద్ద గొప్పదానివేలే శాయిలూ, లెగు లెగు." దురూహ్యమైన ఈ మాటలు వినవచ్చాయి.

"ఏవంటివయ్యా, నువ్వు. సచ్చేదానితో శతురు మాట్టాడకు" తను విన్న మాటలు నమ్మలేక పోయింది శాయిలు.

"గొప్పదానివేలే, శాయిలూ, పండుబాబయ్య పేణం రచ్చించావు." మళ్లీ అన్నాడు. ఆ మాటల్లో ప్రసన్నత, ఆర్ద్రత వినిపించకపోలేదు.

"శతురు మాట్టాడకయ్యా, నలుగు రిన్నది నీవు ఇనలేదంటయ్యా? నా ఆలోశన ఎరికజేసుకున్నా వంటయ్యా? నన్ను పాపిష్టిది కా...దం...టా...వా." గుండె బద్దలయ్యేలా అన్నది శాయిలు.

"కాదే, శాయిలూ. నీలో పాపం లేదు. పాపిష్టోళ్ల అబద్దంలో తెలి[illegible]తుంది. తెలివిగా ఆడి తెలివిగా బతుకుతారు. నీవు నలుగురిలో ఆడింది నిజమైన అబద్దం, నికార్సయిన అబద్దం! పిచ్చి శాయిలూ, ఆమాత్త్రం ఇంగితగ్నేనం లేని పిచ్చిమారాజును కాదులే" అంటూ శాయిలును దగ్గిరికి తీసుకోబోయాడు.

"తాళయ్యా, నన్నంటమోకు, మయిల పడతావు.",

"ఏంటదే నీ వనేది?" అర్థం కాక అన్నాడు శాయిలాయి.

"నీవు పుణ్ణేత్తుముడివయ్యా. నేను నీ పక్క ఎట్టా జేరేది?" అంటూ శాయిలాయి బుజంపై ఒరిగిపోయి, వాడి విశాలమైన వక్షంపై ఏడుపు మానుకో ప్రయత్నించింది శాయిలు.

"అదంతా, నువ్వేనే... పుణ్ణేత్తుమురాలివి నువ్వే! అనువంటి మంచిబుద్ధి ఎవరికి పుడుతుంది? పుట్టినా మంచికి మంటల్లో ఎవరు దూకుతారే, పిచ్చిదానా?"

"అనువంటి మంచిని మన్నించిన మగాడే నా పెనిమిటయినాడు గదంటయ్యా!" భావావేశంలో భర్తను మరింతగా హత్తుకుంది శాయిలు. ఈ పరిస్థితిలో శాయిలాయి చంక కింద కర్ర తొలిగింది.

"శాయిలూ" పడిపోతూ గాభరాగా అన్నాడు.

"లేదయ్యా, నేనున్నాగా" అంటూ శాయిలాయిని తన కౌగిలిలో పట్టుకుంది.

"అబ్బాయి, శాయిలూ, నీకు ఈడనుంచి మంచితనం మరోకాలు, గొప్పోడివి!" అంటూ పసివాణ్ణిలా లాలిస్తూ బుజ్జగించింది శాయిలు భర్తను.

"శాయిలూ!"

"శాయిలూ!"

ఎవరు ఎవర్ని పిలిచినా ఒకే పదం వినపడే దాంపత్యం అది. ★




బ్రెయిల్ లిపి ఆధారంగా పూలమొక్క పేరు తెలుసుకుంటున్న అంధ బాలిక

## అంధులకు పూలతోట

**అంధులకు** స్పర్శతో ఏది ఏదో గ్రహించగల సూక్ష్మగ్రాహ్య శక్తి ఉంది. అందుచేతనే వారు చదువుకోటానికి బ్రెయిల్ అనే ప్రత్యేక సాంకేతిక భాష రూపొందింది. వేళ్లతో తాకుతూ ఆ భాష ఉన్న పుటల్ని చురుకుగా చదవగలుగుతారు. కళ్లతో చూడ లేని దానిని వారు మనసుతో చూడగలుగుతారు.

గులాబీలు ఎన్నో రకాలు ఉన్నాయని మనకు తెలుసు. అంధులు ప్రతిరకం గులాబీని, పూల మొక్కను దాని వాసనతో పోల్చుకోటానికి అనువుగా హాంబర్గ్ (పశ్చిమ జర్మనీ)లో ఒక పూలతోట పెంచుతున్నారు. ప్రతి మొక్క సమీపంలో బ్రెయిల్ భాషలో ఆ మొక్క పేరు వ్రాసిన పలక ఉంటుంది. అంధులు దాని సమీపానికి వెళ్లి స్పర్శజ్ఞానంతో ఆ మొక్క ఏదో తెలుసుకుంటారు. పరిమళాన్ని ఆఘ్రాణించి, ఫలానా రకం గులాబీ పువ్వు ఇటువంటి పరిమళం వెదజల్లుతుంది అని గ్రహిస్తారు. తరవాత కేవలం వాసననుబట్టి ఆ పూలమొక్క ఏదో ఇట్టే చెప్పగలుగుతారు ఆ అంధులు.

( యు పి. ఎస్. [illegible] )